చారిత్రక సాక్ష్యానికి ముప్పు?



జిల్లాలోనే పేరొందిన కొండకర్ల–వాడ్రాపల్లి ఆవకు విచ్చేసే అతిథుల విడిది కోసం బ్రిటిష్ కాలంలో నిర్మించిన గెస్ట్ హౌస్ అది. ఐదెకరాలకు పైగా విశాలమైన స్థలం కలిగిన విశ్రాంతి మందిర ప్రాశస్తమది. ఎన్నో చారిత్రక సమావేశాలకు, సభలకు వేదికగా నిలిచిన విశ్రాంతి మందిరమది. ఇంత ప్రాచుర్యం పొందిన ఆ విశ్రాంతి మందిరం ఇప్పుడు బూత్ బంగ్లాను తలపిస్తోంది. చారిత్రక ఆనవాళ్లకు సాక్ష్యంగా నిలిచే ఇటువంటి భవనాలను పునర్నిర్మించుకుని అందంగా తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

- శిథిలావస్థలో బ్రిటిష్ కాలం నాటి కొండకర్ల గెస్ట్ హౌస్
- కార్యరూపం దాల్చని ఆధునికీకరణ నిర్ణయం
- బ్రిటన్ రాణులు సేద తీరిన భవనంగా గుర్తింపు



శిథిలావస్థకు చేరిన కొండకర్ల గెస్ట్‌హౌస్

అచ్యుతాపురం: రెండు వేలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండకర్ల–వాడ్రాపల్లి ఆవకు ఎంతో ప్రత్యేకత ఉంది. పచ్చని పైరుల సొగసులు, నీలి కాంతుల స్వచ్ఛమైన నీటి మధ్య ప్రశాంత వాతావరణంలో విహారం ఆ అనుభూతి మరువలేనిది. ఆవలో చేపల వేటకు మైమరిచిన బ్రిటిష్ పాలకులు వచ్చి అప్పట్లో ఈ విశ్రాంత మందిరంలో సేద తీరేవారు. బ్రిటిష్ పాలకులు ఆవలో విహరించేందుకు వచ్చినప్పుడు రాణులు ఈ గెస్ట్ హౌస్‌లో ఉండేవారని పూర్వీకులు చెబుతుంటారు. అందుకే 5 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భవనంతో పాటు, తోట ఉండేది. ప్రస్తుతం శిథిలమైన గెస్ట్ హౌస్‌ను జెడ్పీ సీఈవోతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఇటీవల పరిశీలించారు. ఎంత నిధులు అవసరమైనా చారిత్రక కట్టడంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆ నిర్ణయం మరుగున పడిపోయినట్టు స్థానికులతో పాటు పర్యాటకుల్లో అనుమానం కలుగుతోంది.

ప్రైవేట్ రిసార్టులకు పోటీ వస్తుందని.?

వాస్తవానికి కొండకర్లను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనేక వనరులు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆవకు సమీపంలో ఎన్నో ప్రైవేట్ కాటేజీలను నిర్మించారు. ఆయా ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లకు భారీగా అద్దెను వసూలు చేస్తున్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి స్థలం లేక హరిపాలెం కొండవైపు ఉన్న స్థలాలను ప్రతిపాదించారు. కానీ ఎన్నో శతాబ్దాల నుంచి ఉన్న కొండకర్ల గెస్ట్‌హౌస్ ఆధునికీకరణపై మాత్రం దృష్టి పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ గెస్ట్‌హౌస్‌ను అభివృద్ధి చేస్తే ప్రైవేట్ కాటేజీలకు పోటీ వస్తుందన్న అనుమానంతో ఇప్పటి వరకూ ఇటు వైపుగా చూడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొండకర్ల గెస్ట్ హౌస్ నుంచి చూస్తే ఆవ ప్రాంతం కనిపిస్తుంది. ఎత్తయిన మెట్ట ప్రాంతంలో సర్వే నంబర్ 183లో 5.3650 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్రాంతి భవనాన్ని అప్పట్లో ఎంతో పక్కాగా నిర్మించారు. అప్పట్లో చుట్టూ ఎటువంటి నిర్మాణాలు ఉండేవి కావు. ఇప్పుడు లే–అవుట్‌లు, ఇతరత్రా ప్రైవేట్ నిర్మాణాల నేపథ్యంలో భూముల ధరకు భారీగా పెరగడంతో అత్యంత విలువైన 5 ఎకరాల భూమిని సైతం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



పాడైన మరుగుదొడ్డి



శిథిల స్థితిలో వాచ్‌మన్ గది

నిధులు అంచనా వేస్తున్నాం..

కొండకర్ల గెస్ట్ హౌస్ చారిత్రక కట్టడంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదన ఉంది. ఇది శిథిలమైన సంగతి విదితమే. ఇటీవల ఎమ్మెల్యే, జెడ్పీ సీఈవో సైతం ఆదేశాలు జారీ చేశారు. నిధులు ఎంత అవసరం అవుతుందో అంచనా వేసి నివేదిస్తాం. త్వరలోనే పునః నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయనే నమ్మకం ఉంది.

– నాయుడు, పంచాయతీ రాజ్ ఏఈ

క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ

పాయకరావుపేట: ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు జెడ్పీ నిధుల నుంచి చేతి బోర్ల నిర్మాణం చేస్తున్నట్లు జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా రూ.1.10 లక్షలతో లింగాల కాలనీలో బోరు నిర్మించామన్నారు. ఈ మేరకు ఈ బోరును ఆదివారం ఆయన ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి ఇప్పటికే పట్టణంలో పలు చోట్ల చేతిబోర్ల నిర్మాణం చేపట్టామని సూర్యనారాయణ తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



జలపాతంలో జలకాలాడుతున్న సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో సందర్శకులు జలకాలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. సంహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కేరింతలు కొట్టారు. రెండు జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీ ఏర్పడింది.

శంభువానిపాలెంలో రేపు ఎడ్ల బళ్ల పోటీలు

దేవరాపల్లి : శంభువానిపాలెంలో పరదేశమ్మ తీర్థం మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.2వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మంగళవారం ఉదయం నుంచి పరదేశమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవితం



సైకిల్ యాత్రలో పాల్గొన్న యోగా సభ్యులు

అనకాపల్లి: నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా రవాణా అధికారి జి.మనోహర్ అన్నారు. గాంధీనగరంలోని యోగా లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విపత్తు తర్వాత ప్రతి ఒక్కరు యోగాపై ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. గాంధీనగరంలో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర చోడవరం ముదుర్తి సంఘమేశ్వరస్వామి ఆలయం వరకూ సాగుతుందని, 30 మంది పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జి.రామ్మూర్తి, దేవర్షి ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సుందరయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, యోగా సభ్యులు సత్యనారాయణ, కొణతాల రాజేంద్ర, పీలా రవీంద్ర, కరణం దేవి, లక్ష్మి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యనారాయణ స్వామి కల్యాణం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కోటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి సారె ఊరేగింపు వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ రాంబిల్లి రూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, యలమంచిలి, యర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. అవకాశం ఉన్నచోట తెల్లవారుజాము 2 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

ఒత్తిడి లేకుండా 'పది' పరీక్షలకు చదవండి



పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న హెచ్‌ఎం ముత్యాల జయలక్ష్మి

మునగపాక(అచ్యుతాపురం): పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని గణపర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముత్యాల జయలక్ష్మి సూచించారు. శనివారం రాత్రి మునగపాక మండలంలోని గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటికి వెళ్లి పలు అంశాలపై సమీక్షించారు. రెండు నెలల పాటు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు తర్ఫీదు పొందాలని చెప్పారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు అభ్యసించాలని కోరారు.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ



రోడ్డు పక్కన పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్న స్థానికులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు వైఎస్సార్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. వీధుల్లో మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గ్రామంలో సుమారు 250 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, నిర్మాణాలకు ఇందిరమ్మ పథకం కింద రుణాలు మంజూరు చేశారు. అలా అప్పట్లో నిరుపేదలు పక్కా ఇళ్లు నిర్మాణాలు చేసుకున్నారు. అయితే కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదు. పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. వాటికి అనుకుని కాలువల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఇళ్లలో వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దుర్గంధంతో పాటు దోమలతో కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మోడల్ స్కూల్‌లో సరస్వతీ దేవికి పూజలు



సరస్వతీ విగ్రహానికి వందనం చేస్తున్న సేవా వికాస్ సంస్థ ప్రతినిధులు

మునగపాక(అచ్యుతాపురం): వసంత పంచమి పురస్కరించుకుని మునగపాక ఏపీ మోడల్ స్కూల్‌లో సరస్వతీ దేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా వికాస్ సంస్థ ప్రతినిధులు పొలమరశెట్టి వీర అప్పారావు, పొలమరశెట్టి ఆనందరావు ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల నిధులతో సరస్వతీ విగ్రహాన్ని గతంలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రత్యేక పూజలు అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

బ్రాండిక్స్ కార్మికుల వేతనాలు పెంచాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం: బ్రాండిక్స్(అధిస్థాన్ సమీకృత పారిశ్రామిక పార్కు) కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ బ్రాండిక్స్ కార్మికుల వేతనాలు పెంచాలని చేస్తున్న ఆందోళనకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్మికులకు మద్దతుగా వెళ్లిన సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. నిర్బంధాలకు పాల్పడితే కార్మికులు మరింత పట్టుదలతో ఉద్యమాలు చేస్తారని హెచ్చరించారు. బ్రాండిక్స్ కార్మికుల సమస్యల విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం సరిగ్గా స్పందించడం లేదన్నారు. 2015 నుంచి జీతాలను సవరించకపోవడంతో బ్రాండిక్స్ కార్మికులు తక్కువ జీతాలతో పని చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, ఎస్.బ్రహ్మాజీ, ఐద్వా నాయకులు సీహెచ్.మంగతాయారు, ఆర్.లక్ష్మి, మత్స్య, కార్మిక సంఘం నాయకుడు చేపల తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతకు సమగ్ర రైతు సహకార సంస్థ చేయూత



నిత్యావసర సరకులు అందిస్తున్న డీపీఎం వెంకట్

కోటవురట్ల: గ్రామీణ ప్రాంత యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర రైతు సహకార సంస్థ చేయూతనిస్తుందని ఆ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.వెంకట్ తెలిపారు. రామచంద్రపాలెంలో సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌డీజీ గ్రూప్ సభ్యులకు ఆదివారం నిత్యావసర సరకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 40 మంది సభ్యులకు నిత్యావసర సరకులు సరఫరా చేసినట్టు తెలిపారు. సంఘ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, యువతను ప్రోత్సహించేందుకు వారి నైపుణ్యం ఆధారంగా రాయితీపై పరికరాలు, యూనిట్లను మంజూరు చేస్తామన్నారు. నిరుపేదలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యుడు పి.నానిబాబు, ఉప సర్పంచ్ ఎస్.హరిశ్చంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ నంబాబు రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ జి.రాము, గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేకేబీ చర్చి కార్యవర్గం ఎన్నిక



కేకేబీ చర్చి నూతన కార్యవర్గం సభ్యులు

కోటవురట్ల: స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా ఎ.అప్పారావు, ఆర్.కన్నారావు, చీఫ్ అడ్వైజర్‌గా ఎం.శ్యాంప్రసాద్, సంఘం అధ్యక్షుడిగా ఎం.ఆనందరాజ్, కార్యదర్శిగా ఆర్.ప్రసన్నకుమార్, కోశాధికారిగా ఎస్.సాందీప్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా పి.జాన్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఎం.సునాథబాబు, డిప్యూటీ కోశాధికారిగా ఆర్.నానిమణిమోహన్, ఆడిటర్‌గా ఎం.రాజు, స్త్రీల సంఘం కన్వీనర్‌గా కె.ఎ.ఎస్.జయంతి, యూత్ కన్వీనర్‌గా ఎస్.కె.వి.ప్రసాద్, సలహాదారులుగా పి.డేవిడ్, జి.ఆనంద్, ఎం.గణేష్, ఎస్.ఎ.సుకుమార్, జె.వి.ప్రసాద్, బి.ఏసుదాసును ఎన్నుకున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు.

క్వారీ ప్రాంతాల్లో సంచరిస్తే కేసులు తప్పవు

గొలుగొండ : కరక, సాలికమల్లవరం, పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీ ప్రాంతాల్లో ఎవరైనా సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని గొలుగొండ ఎస్‌ఐ రామారావు హెచ్చరించారు. ఆయన శనివారం అర్ధరాత్రి సమయంలో కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం రంగురాళ్ల ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పై మూడు రంగురాళ్ల క్వారీల్లో 144 సెక్షను అమల్లో ఉందని, ఎవరైనా ఇతర వ్యక్తులు ఆ ప్రాంతాల్లో సంచరిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న కశిరెడ్డి అప్పలనాయుడు

అనకాపల్లి: సత్యసాయి సంస్థల్లో సేవలు విస్తృతం చేయాలని సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని సత్య సాయిబాబా ఆలయంలో జిల్లా సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్య సాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలన్నారు. గ్రామ సేవలు, మొక్కలు నాటడం, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపు, దివ్యాంగులకు సేవల వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్లు కామరాజు, శక్తిమూర్తి, శంకర్, కృష్ణంరాజు, సంస్థల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాండురంగస్వామి కల్యాణోత్సవాలు



పాండురంగ స్వామి ఆలయం

పాయకరావుపేట: రాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.దివ్యతేజ తెలిపారు. 3న స్వామికి అంకురార్పణ, 4న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న నిత్య విశేష కార్యక్రమం, 6న సదస్య మహోత్సవం, 7న తిరుమంగేయాళ్వార్ దొంగలదోపు ఉత్సవం, 8న పూర్ణాహుతి, చక్రస్నానం, 9న శ్రీపుష్ప యాగం నిర్వహిస్తామన్నారు. ఆలయ అర్చకులు నారాయణ ఆచార్యులు, కృష్ణస్వామి, ఆగమ పండితులు గోమఠం పవన్, పార్థసారథి అయ్యంగార్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు జరుగుతాయన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

కశింకోట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ కార్మికులు ఆదివారం మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీ మేస్త్రీ తదితరులకు బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించాలన్నారు. 20 ఏళ్ల క్రితం ఉన్న ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించి సామాన్యులు విరివిగా భవన నిర్మాణాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా కార్మికుల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలన్నారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు టి. అప్పారావు, కె. గోవింద, ఎన్. శ్రీను, ఎస్. నూకరాజు, సీహెచ్ శేషు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి కన్యకా పరమేశ్వరి శత జయంత్యుత్సవాలు

అనకాపల్లి: మెయిన్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి నూరేళ్లు అవుతున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భీష్మ ఏకాదశి రోజున అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందన్నారు. శతజయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న 1000 మందితో అమ్మవారి ఆలయం నుంచి శోభాయాత్ర జరుగుతుందన్నారు. 5న సామూహిక లక్ష తులసి నామార్చనలు, 6న మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 7న లక్ష కుంకుమార్చనలు, చండీహోమం, ఏకోత్తర సహస్ర (1001) కలశ మండపారాధన, 8న అమ్మవారికి 1001 కలశాలతో ఏకోత్తర సహస్ర పూజ, మహా కుంబాభిషేకం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, వంటి అనేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మంచు'పల్లె'కీ



బుచ్చెయ్యపేట రోడ్డులో మంచులో వెళ్తున్న వాహనదారులు



పంట పొలాలను కమ్మేసిన పొగమంచు



వడ్డాది పెద్దేరు వంతెనపై దట్టంగా పొగమంచు

సాధారణంగా మంచు తెరల్లో ప్రకృతి అందాలు తిలకించడానికి అరకు, సీలేరు, పాడేరు, చింతపల్లి తదితర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రకృతి ప్రియులు ఇపుడు మైదానప్రాంతాల్లో దట్టమైన పొగమంచును చూసి ఆస్వాదిస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి తెల్లవారు జాము 9 గంటల వరకు పొగమంచు కమ్ముకుంటున్నది. వాహనదారులు పగలే లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణాలు సాగిస్తున్నారు. బుచ్చెయ్యపేట, వడ్డాదిలో కనిపించిన దృశ్యాలివి.

–బుచ్చెయ్యపేట

'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి'

మునగపాక(అచ్యుతాపురం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఓ ప్రకటనలో ఆరోపించారు. కేంద్రం చేసిన ద్రోహానికి రాష్ట్ర ప్రజలు నిరసన తెలపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రత్యేక హోదా ప్రస్తావన లేదని, వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావనే లేదని విమర్శించారు. విభజన చట్టం ప్రకారం ఏపీలో జాతీయ సంస్థల ఏర్పాటుకు ఎటువంటి నిధులను కేటాయించలేదన్నారు. రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదేపదే ప్రస్తావించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కేంద్రం విస్మరించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌పై సీఎం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేతపై మాట్లాడకపోవడం మోసం చేయడమేనని గనిశెట్టి పేర్కొన్నారు.